క్లుప్తంగా

పురిటిపెంటలో 104 వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: మండల కేంద్రంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం–2 పరిధిలో బుధవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి 56 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్యజాగ్రతలపై అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత పెరిగిందని, వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సహాయం



బాధితుడికి వంట పాత్రలు, ఇతర సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి,తదితరులు

వేపాడ: మండలంలోని రాయుడుపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహాయం చేసింది. వంట పాత్రలు, రగ్గులను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి చేతులమీదుగా బుధవారం అందజేశారు. తహసీల్దార్ రాములమ్మ, రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు టి.సూర్యారావు, ఎస్.కోట బ్రాంచ్ చైర్‌పర్సన్ డాక్టర్ వరలక్ష్మి, జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు ఏం.రాము, మన్మధరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ టీఏలకు బదిలీ

గంట్యాడ: మండలంలోని ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లకు(టీఏలు) బదిలీ అయ్యిందని ఏపీఓ గర్బాపు సుందరరావు బుధవారం తెలిపారు. టీఏ శంకరరావుకు వేపాడ బదిలీ కాగా ఆయన స్థానంలో గజపతినగరం నుంచి సంతోషికుమారి ఇక్కడికి బదిలీపై వచ్చారు. టీఏ శశి, రాధ ఎస్.కోటకు బదిలీ అయ్యారు.వారి స్థానంలో కొత్తవలస నుంచి గంగ, విజయనగరం నుంచి జయకుమారి ఇక్కడికి వచ్చారు. అలాగే ఇంజినీరింగ్ కన్సల్టెంట్ జోగారావుకు వేపాడ కు బదిలీ కావడంతో డెంకాడ నుంచి శంకర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

న్యాయవాదుల సంఘం ఎన్నిక



న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు

కొత్తవలస: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నిక బుధవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలుగా ఆర్.ఎస్.ఆర్.ఎల్.దేవి, ఉపాధ్యక్షుడిగా ఎన్.వి.సత్యనారాయణ, ట్రెజరర్‌గా ఎం.కృష్ణమూర్తి, లైబ్రరీ కార్యదర్శిగా బోజింకి సన్యాసిరావు, మెంబర్స్‌గా జి.పి.లత, విన్నకోటి రాజేష్, రొంగళి కృష్ణంనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికకాగా.... కార్యదర్శి,జాయింట్ కార్యదర్శి పదవులకు ఎన్నికలు నిర్వహించగా కార్యదర్శిగా వై.గణేష్‌నాయుడు,జాయింట్ కార్యదర్శిగా గవర కృష్ణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి న్యాయమూర్తి డాక్టర్ సముద్రాల విజయచంద్ర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

చీపురుపల్లి: పదోతరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు చీపురుపల్లిలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ఆ కళా శాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 31 వరకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఏప్రిల్ 7 నుంచే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులు ఉంటాయని తెలిపారు.

నేడు ఉప సర్పంచ్‌ల ఎన్నిక

బొండపల్లి: మండలంలోని గొట్లాం, గరుడబిల్లి, వేంద్రాం పంచాయతీల ఉపసర్పంచ్ పదవులకు గురువారం ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.గిరిబాల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు 11 గంటలకు నామినేషన్లు దాఖలు చేసిన తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నిబంధనలకు అనుగుణంగా ఎన్నిలు నిర్వహిస్తారని స్పష్టం చేశారు.

పల్లెల్లో మద్యం జోరు

- ఊరూరా పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు
- 24గంటలూ యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు




గంగచోళ్లపెంట గ్రామంలో శివాలయానికి సమీపంలో సచివాలయానికి ఆనుకుని ఉన్న బెల్ట్ షాపు



గంగచోళ్లపెంటలోని బెల్ట్ షాపులో మద్యం తీసుకుంటున్న వృద్ధుడు



కొనిశ గ్రామంలో బెల్ట్ షాప్ వద్ద మద్యం తాగుతున్న మందు బాబులు



గజపతినగరం రూరల్: మండలంలోని గ్రామాల్లో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. గుడి, బడి, నివాస ప్రాంతాలనే తేడా లేకుండా ఎక్కడికక్కడ బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసి యథేచ్ఛగా, 24 గంటలూ మద్యం విక్రయాలు చేస్తున్నారు. చాలా వరకు కిరాణా దుకాణాలు మద్యం షాపులుగా మారిపోయాయి. ప్రభుత్వ లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకే తెరిచి ఉంటాయి. కానీ గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో మాత్రం ఎనీటైమ్ మందు అందుబాటులో ఉంటోంది. కూలిపనులు చేసుకునే నిరుపేదలు, మందు అలవాటు ఉన్న యువకుల నుంచి వృద్ధులు వరకు అంతా మద్యం మత్తులో జోగు తున్నారు. చాలామంది మద్యానికి బానిసగా మారి ఉదయాన్నే బెల్టు షాపుల్లో మద్యం తాగి కూలి పనులకు సైతం వెళ్లడం మానేస్తున్నారు. ప్రభుత్వ లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నిర్వాహకులు తమ వ్యాపారం పెంచుకునేందుకు నిబంధనలకు పాతరేస్తూ గ్రామాల్లో బెల్టు దుకాణాలను ప్రోత్స హిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. లైసెన్స్‌డ్ దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు మద్యం డోర్‌డెలివరీ అవుతోందనే చర్చ అంతటా జరుగుతోంది. దీన్ని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లైసెన్స్‌డ్ దుకాణాల నిర్వాహకుల్లో అధికశాతం కూటమి నాయకులే కావడంతో ఆ దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు మద్యం సరఫరాను అడ్డుకునే సాహసం చేయలేకపోతున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు కూడా కూటమి నాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయనే చర్చ జరుగుతోంది.

ప్రేక్షకపాత్రలో అధికారులు

మండలంలోని 31 పంచాయతీల్లోని 70 శాతానికి పైగా గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీ నాయకులే దగ్గరుండి వేలం పాటలు నిర్వహించి బెల్టు షాపులు కేటాయించారు. అయితే అధికారులు మాత్రం గ్రామాల్లో బెల్ట్ షాపులు లేవని, అవి ఎక్కడా మాకు కనిపించడం లేదని చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు వద్ద మందుబాబులు సౌకర్యవంతంగా మందు తాగేందుకు దేరాలు కట్టి బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తూ మందుబా బుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. విచ్చలవిడి గ్రామాల్లో దొరుకుతున్న మద్యం కారణంగా పచ్చటి కాపురాల్లో చిచ్చుపెడుతోంది. యువత పెడదారిపడుతుండడంతో పాటు గ్రామాల్లో గొడవలు పెరిగిపోతు న్నాయి. గంటచోళ్లపెంట గ్రామంలో శివాలయం పక్కనే సచివాలయాన్ని ఆనుకుని బెల్ట్ షాపు నడుస్తున్నప్పటికీ అక్కడి సిబ్బందికి కానీ ఎక్సైజ్ శాఖ అధికారులకు కనిపించడం లేదు. బెల్ట్ షాపుల విషయాన్ని ఎక్సైజ్ సీఐ జనార్దనరావు వద్ద సాక్షి ప్రస్తావించగా గ్రామాల్లో ఎక్కడా మాకు బెల్టు షాపులు కనిపించడం లేదని, మాకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పడం గమనార్హం.

ఆలయ హుండీ ఆదాయం రూ.5.18 లక్షలు



ఎస్.కోట మండలంలోని కొట్టాం గ్రామంలో కోటమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. అమ్మవారి పండగ మంగళవారం ముగియడంతో జనవరి 31వ తేదీ నుంచి ఈనెల 26వ తేదీ వరకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. హుండీల ద్వారా రూ.5,18,528లు రాగా, 6.5గ్రాముల బంగారం, 595గ్రాములు వెండిని భక్తులు కానుకల రూపంలో సమకూర్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ చెప్పారు. దేవస్థానం ఉద్యోగులు, గ్రామ పెద్దలు, సేవకులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

ప్రకృతి సేద్యం చేద్దాం...



మన కోసం, మన పిల్లల ఆరోగ్యం కోసం ప్రకృతి సేద్యం చేద్దాం అంటూ సంతగవిరమ్మపేట సర్పంచ్ కళావతి పిలుపునిచ్చారు.మండల వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంయుక్తంగా బుధవారం ఆ గ్రామంలో ప్రకృతి సేద్యం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగుతో పంటలు బాగు అన్న అంశాలను రైతులకు వివరించారు. పంటను ఆశించే చీడపీడల నివారణకు తయారు చేసుకోవాల్సిన జీవామృతాలు, కషాయాలు, ద్రావణాలు, వాటిని వినియోగించే పద్ధతిని రైతులకు వివరించారు. పెరటితోటల ఆవశ్యకత, వాటి పెంపకంలో చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఏపీసీఎన్‌ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ డి.కృష్ణ, వీఏఏ రవి, ఐసీఆర్‌పీ రాముతో పాటు గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

పరామర్శ



వాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్య, తదితరులు

దత్తిరాజేరు: పెదమానాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శిష్టకరణం సంఘ నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు వాసు ఇటీవల మృతి చెందారు. గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య బుధవారం పెదమానాపురం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి,మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడుతో కలిసి వాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసు మృతికి గల కారణాలను ఆయన కుమారుడు న్యాయవాది రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ గొటివాడ దాసు, ఎంపీటీసీ సభ్యుడు గొటివాడ కన్నయ్య, ఉప సర్పంచ్ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మహదేవ్ ఫణీంద్రుడు, కిలుగు కనకరాజు ఉన్నారు.

ఆశీల వసూళ్లకు వేలం పాట



వేలం పాటలు నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రోజువారీ మార్కెట్, వారపు సంతలో ఆశీల వసూళ్లకు, కబేలా నిర్వహణకు సంబంధించిన వేలం పాటలను పంచాయతీ అధికారి ఝాన్సీ నేతృత్వంలో పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు.రోజు వారీ మార్కెట్ ఆశీల వేలం పాటను రూ.10,51,100కు, కబేలా నిర్వహణ వేలంను రూ.95,100కు రెడ్డి నర్సింగరావు అనే వ్యక్తి, వారపు సంత పాటను రూ.75 వేలకు కొసిరెడ్డి మాధవ అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈ మూడు వేలం పాటల్లో గతేడాది కంటే ఈ ఏడాది రూ.4 లక్షలు అదనంగా పంచాయతీకి ఆదాయం లభించిందని పంచాయతీ అధికారి చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ రాము, సిబ్బంది ఈశ్వరరావు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక రేపు

దత్తిరాజేరు: మండలంలో అన్ని గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ అప్పలనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, జిల్లా డ్వామా అధికారులు, మండల ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలపై ఈనెల 28న స్థానిక స్త్రీ శక్తి భవనం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సతీష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 26 పంచాయతీల్లో 20 23 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఉపాధి పనులు, చెల్లింపులు, ఉపాధిహామీ పథకం నిధులతో వివిధ ప్రభుత్వ శాఖలు వారు చేసిన పనులు, చెల్లింపులపై గ్రామ స్థాయిలో మార్చి 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సామాజిక తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆ నివేదికలపై శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రజావేదిక నిర్వహించి ప్రజల సమక్షంలో బహిరంగంగా చర్చ జరుపుతారని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



అంబటివలస వద్ద జాతీయ రహదారి–26ను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యరెడ్డి

బొండపల్లి: మండల పరిధిలోని జాతీయ రహదారి–26పై తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి స్థానిక పోలీస్ అధికారులకు సూచించారు. మండలంలోని బోడసింగిపేట ,అంబటివలస, గొట్లాం గ్రామాల్లో బైపాస్, జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బుధవారం సాయంత్రం పరిశీలించారు. అంబటివలస వద్ద రోడ్డు కుంగిపోయి ఎత్తు పల్లాలు ఉండడం వల్ల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఎస్‌ఐ యు.మహేష్ డీఎస్పీకి వివరించారు.తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్టాపర్లు, వేగనిరోధకాలు ఇప్పటికే ఏర్పాటు చేసినప్పటికీ మరిన్ని చోట్ల వాటిని ఏర్పాటు చేయాలని ఎస్‌ఐని డీఎస్పీ ఆదేశించారు. డీఎస్పీ వెంట గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పనివేళలు మార్చాలి

శృంగవరపుకోట: వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా పనివేళలను కచ్చితంగా మార్చాలని, పని ప్రదేశాల్లో కార్మికు లకు తగిన చల్లని వాతావరణం, ప్రథమ చికిత్స సదుపాయాలు కల్పించకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తా మని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.కిరణ్‌చంద్ర బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కంపెనీలు, దుకాణ దారులు, వివిధ సంస్థల, ప్రైవేటు యజమానులు అంతా తాము పనిచేయించుకునే పని ప్రదేశాల్లో కార్మికులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, విశ్రాంతి కోసం నీడ సదుపాయం, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్న కార్మికశాఖ కమిషనర్ ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్మికులతో పనులు చేయించడం మానుకోవాలని హెచ్చరించారు. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే సమయానికి పని గంటలు మార్చుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 4గంటల మధ్య సమయంలో ఎక్కడైనా కార్మికులు పనులు చేస్తూ కనిపిస్తే సంబంధిత యజమానులు, లేదా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

బైపాస్ పేరుతో పొట్ట కొట్టొద్దు

- నిర్వాసిత రైతుల వేడుకోలు
- విచారణలో గళమెత్తిన రైతులు



రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న వీఆర్ఓలు కన్నయ్య, రమణ

శృంగవరపుకోట: విశాఖపట్నం– అరుకు మార్గంలో ఎస్.కోట మీదుగా అభివృద్ధి చేయనున్న జాతీయరహదారి– 516బీలో బైపాస్ రోడ్డు నిర్మాణంతో తమ పొట్ట కొట్టొద్దు అంటూ నిర్వాసిత రైతులు వేడుకున్నారు. జాతీయరహదారి– 516బీ లో కొత్తూరు నుంచి కాపుసోంపురం వరకు చేపట్టనున్న బైపాస్ రోడ్డును స్థానిక రైతాంగం వ్యతి రేకిస్తున్న విషయం విధితమే. ఇదే విషయమై ఈనెల 17 కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఏపీ రైతు సంఘం నేతృత్వంలో రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో రైతుల అభ్యంతరాలు, ఉద్దేశాలను తెలుసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించారు. స్థానిక వీఆర్ఓలు కన్నయ్య, రమణ భూములు కోల్పోతు న్న నిర్వాసితులతో బుధవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా రైతు లు మాట్లాడుతూ పోలవరం కాలువ కోసం ఇప్పటికే భూములు కోల్పోతున్నామని, ఇప్పుడు బైపాస్ అని భూములు లాక్కుం టే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎస్.కోట పట్టణం మధ్య నుంచి ఉన్న రోడ్డు 180 అడుగుల వెడల్పుతో ఉన్నట్లు రికార్డుల్లో ఉందని, కానీ వాస్తవంగా 40అడుగులు కూడా లేదన్నారు. ఆ రోడ్డునే వెడల్పు చేసి, అభివృద్ధి చేసే వీలుందని, దాన్ని వదిలేసి కోట్లు ఖర్చుచేసి కొత్త రోడ్డు వేయడమేంటని, బైపాస్‌కు భూములు ఇచ్చేస్తూ తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డు ఎస్.కోట పట్టణాభివృద్ధికిగొడ్డలి పెట్టులా మారుతుందని, పట్టణంలో ఎంతోమంది వ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారన్నారు. ప్రతిపాదిత బైపాస్ అనివార్యమైతే 2013 భూసేకరణచట్టం ప్రకారం పరిహారం ఇస్తూ, భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బల వంతంగా భూములను లాక్కొనే ప్రయత్నం చేస్తే ఉద్యమానికి సిద్ధమని రైతులు వీఆర్ఓలకు చెప్పారు. ఏపీ రైతు సంఘం ప్రతినిధి మద్దిల రమణ, రైతులు వసంత సత్యారావు, మళ్ల సత్యారావు, కొటాన సూర్యం, మంచిన రాము, పిల్లల రమణ, పాలమరశెట్టి రామకృష్ణ, పి.సూరిబాబు, రాము పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్‌పై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): పోలీస్ సిబ్బంది హ్యూమన్ రైట్స్, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. చీపురుపల్లి సర్కిల్ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల పోలీస్ సిబ్బందికి గరివిడిలో బుధవారం అవగాహన కల్పించారు. హ్యూమన్ రైట్స్, సంబంధిత చట్టాలు, వాటిని అమలు చేసే విధానం,అరెస్టుల సమయంలో పాటించాల్సిన విధానాలను వివరించారు. నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సీఐ జి.శంకరరావు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల ఎస్‌ఐలు ఎల్.దామోదరరావు, బి.లోకేష్, జె.లోకేష్ పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ

గజపతినగరం: స్థానిక శ్రీవాసవి కల్యాణ మండపంలో గురువారం ప్రపంచ ఆర్య వైశ్యమహాసభ నిర్వహించనున్నట్లు ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది పండగ నేప థ్యంలో ముందస్తుగా మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏపీ వైశ్యకార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు, గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ, ఎస్‌ఐ కె.లక్ష్మణరావు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఉద యం 10గంటలకు ప్రారంభమయ్యే మహాసభకు జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్య సంఘాల పెద్దలు, వైశ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నవధాన్యాల సాగుతో భూసారం



వల్లంపూడిలో అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ లక్ష్మి

వేపాడ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ అధికారులు అన్నారు. వల్లంపూడిలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ ఎల్.లక్ష్మి, సింగరాయి, దబ్బిరాజుపేట గ్రామాల్లో అడిషనల్ డీపీఎం స్వామినాయుడు రైతులకు నవధాన్యాల సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు అప్పారావు, చిట్టిబాబు, శ్రీను శింగరాయి సర్పంచ్ వెంకటరావు, దేముడు, కోమలత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ నాగభూషణం

వేపాడ: ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నాగభూషణం బుధవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, వారి వర్క్ బుక్స్, పాఠశాలలోని కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో ఆంగ్లం,తెలుగు పదాలను చదివిం చారు. గణితంలో కూడికలు, తీసివేతలు చేయించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడుతూ రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని చెప్పారు.

యథేచ్ఛగా ప్రోటోకాల్ ఉల్లంఘన



సర్పంచ్ లేకుండా కూటమి నేతలతో వేదిక పంచుకుని సదస్సు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి,ఏపీఎం

కొత్తవలస: అధికారులు యథేచ్ఛగా ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నారు. కూటమి నాయకులు చెప్పిందే రాజ్యాంగం అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పంచాయతీల్లో సర్పంచ్‌లు ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను వారు లేకుండానే తమకు నచ్చినట్లు కానిచ్చేస్తున్నారు. సర్పంచ్‌లు ఉండాల్సిన వేదికలపై ఏ పదవులూ లేని కూటమి నాయకులను కూర్చోబెట్టి వారి కనుసన్నల్లో కార్యక్రమాలు జరిపిస్తున్నారు. మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్, ప్రకృతి వ్యవసాయంపై రైతు సేవా కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి రత్నమాలిక, ఏపీఎం (ఎఫ్‌పీఓ) ఏ.వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. వాస్తవానికి ఈసదస్సును సర్పంచ్ సింగంపల్లి వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించాల్సి ఉంది. కానీ ఆమెకు కనీసం మాట మాత్రం చెప్పకుండా కూటమి నేతలతో అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేశారు. మహిళా సర్పంచ్‌లు అంటే అధికారులకు ఎందుకంత చిన్నచూపని, సర్పంచ్‌కు చెప్పకుండా పంచాయతీలో కార్యక్రమాలు నిర్వహించడమేంటని ఆ పంచాయతీ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై సర్పంచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ కేవలం సర్పంచ్ ఆధ్వర్యంలోనే నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి కూడా అధికారులు సమాచారం ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. కూటమి నేతలు చెప్పినట్లే అధికారులు నడుచుకుంటున్నారని, ప్రజలతో ఎన్నుకోబడిన తమకు విలువ ఇవ్వడం లేదని వాపోయారు.ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రత్నమాల,ఏపీఎం వెంకటరమణ వద్ద సాక్షి ప్రస్తావించగా...కార్యక్రమాన్ని ఒక రోజు తర్వాత ఏర్పాటు చేయాలని సర్పంచ్ తమకు చెప్పారని, అయితే ముందుగానే షెడ్యూల్ ఖరారు కావడంతో ఆ ప్రకారమే కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు.